తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## క్షయ ఒకరి నుండి మరొకరికి వ్యాపించే అంటువ్యాధి

**- స్విమ్స్ సంచాలకులు డాక్టర్ బి.వెంగమ్మ**



తిరుపతినగరం, మార్చి 24 (ప్రభాతవార్త : క్షయ వ్యాధి ఒకరి నుండి ఒకరికి వ్యాపించే అంటువ్యాధి అని, క్షయ వ్యాధి నిర్మూలించడానికి ప్రభుత్వం జాతీయ క్షయ నిర్మూల కార్యక్రమం ద్వారా రోగ నిర్ధారణ చేస్తున్నదని స్విమ్స్ సంచాలకులు డాక్టర్ బి.వెంగమ్మ అన్నారు. శుక్రవారం ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా స్విమ్స్ ఆధ్వర్యంలో శ్రీపద్మావతి ఓపిడి బ్లాక్ నందు ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం, అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్షయ వ్యాధి నిర్ధారణ అయిన తరువాత ప్రభుత్వ ఆసుపత్రు లందు ప్రజలకు ఉచితంగా మందులు అందిస్తున్నారన్నారు. ఎన్‌టిఇపి కార్య క్రమం ద్వారా ఉచితంగా వ్యాధి నిర్ధారించి డాట్స్ పద్ధతిలో రోగులకు మంది ఇస్తున్నామన్నారు. క్రమం తప్పకుండా మందులను వేసుకోవడం ద్వారా వ్యాధిని నిరోధించవచ్చునని తెలిపారు. 2025 సంవత్సరంలోపు దేశంలో పూర్తిగా క్షయ వ్యాధి నిర్మూలించాలని ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదన్నారు. శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శరణ్ బి సింగ్ మాట్లాడుతూ క్షయ వ్యాధి వున్న వారు దగ్గినా, తుమ్మినా గాలి ద్వారా వేరు వారికి వ్యాప్తి చెందుతుందన్నారు. అందువల్ల క్షయ వ్యాధి రోగులు తగిన జాగ్రత్తలు పాటించి త్వరగా వైద్య పరీక్షలు చేసుకొని మందులు వాడటం ద్వారా టిబి వ్యాధి పూర్తిగా నయం చేసుకోవచ్చునన్నారు. స్విమ్స్ డీన్ డాక్టర్ అల్లాడి మోహన్ మాట్లాడుతూ 1882 లో టిబి కలుగజేసే సూక్ష్మ క్రిమి ఉనికిని తెలియజేసిన సందర్భంగా మార్చి 24వ తేదిన క్షయవాయధి దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు.గత 15 సంవత్సరాలుగా డాట్ సెంటర్ నందు టిబి రోగులకు ఉచితంగా సేవలందిస్తూ వున్న జిల్లా కంట్రోల్ క్షయ ఆఫీసర్ మహేశ్వరి మరియు వాణికు ప్రశంసా పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ మెడికల్ సూపరిన్‌టెండెంట్ డాక్టర్ రామ్, డాక్టర్లు బాబు, హరికృష్ణ, సమీరజ, మనోల్లాస్య, రమ, మానస, సాయిరాం, ప్రశాంత్, అనీల్, రోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంధనశాఖపైనే...
# రూ.9లక్షల కోట్ల పెట్టుబడులకు సిద్ధం

**-రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి**
**ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు సిఎం సముఖత : ఎంపి మిథున్**



ఎలక్ట్రోస్టీల్‌కాస్టింగ్ పరిశ్రమ భూమిపూజ కార్యక్రమంలో మంత్రి పెద్దిరెడ్డి

పుంగనూరు, మార్చి 24 ప్రభాతవార్త :విశాఖపట్నంలో జరిగిన ఇండస్ట్రియల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌కు రాష్ట్ర,దేశ వ్యాప్తంగానే కాకుండా ఇతర దేశాలనుంచి కూడా పెద్దఎత్తున వ్యాపారదిగ్గజాలు వచ్చి రూ.13.5లక్షల పెట్టుబడులకు సంసిద్ధత వ్యక్తంచేయడం వెనుక సిఎం జగన్మోహన్‌రెడ్డిపై ఉన్న నమ్మకమే ప్రధాన కారణమని రాష్ట్ర అటవీ,ఇంధన, గనులశాఖల మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం ఉదయం మండలంలోని ఆరడిగుంట గ్రామంవద్ద52 ఎకరాలలో దేశంలోనే పేరెన్నికగన్న ఎలక్ట్రోస్టీల్ కాస్టింట్ అధ్వర్యంలో ఫెర్రోఅలయ్ పరిశ్రమ ఏర్పాటు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అలాగే రెండువేల ఎకరాలతో పుంగనూరు వద్ద సిబిఐసి చెన్నైబెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సుముఖత వ్యక్తం చేశారని రాజంపేట ఎంపి,రాజ్యసభ ప్యానెల్ స్పీకర్ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ప్రకటించారు. శుక్రవారం ఉదయం పుంగనూరు మండలంలోని ఆరడిగుంట వద్ద ఎలక్ట్రోస్టీల్ కాస్టింగ్ అధ్వర్యంలో ఫెర్రోఅలయ్ పరిశ్రమ భూమిపూజా కార్యక్రమానికి ఆయన విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ బెంగళూరు,చెన్నై మధ్యన ఉన్న పుంగనూరు ప్రాంతంలో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుచేయడం వల్ల ఈప్రాంతాలు వృద్ధిలోనికి వస్తాయన్నారు. ఇందుకోసం రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచనలతో రెండువేల ఎకరాల భూమిని కేటాయించేందుకు రాష్ట్రప్రభుత్వానికి జిల్లాకలెక్టర్ ప్రతిపాదనలు పంపారన్నారు. ముఖ్యమంత్రి కూడా ఈప్రతిపాదనలపట్ల ఎంతో సుముఖతతో ఉన్నారన్నారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఇందుకోసం సంయుక్తంగా నిధులు కేటాయించాల్సి ఉందన్నారు. పుంనగూరులో సిబిఐసి ఏర్పాటు అయిన వెంటనే ఉద్యోగాలే నిరుద్యోగుల కోసం వెదికే పరిస్థితి వస్తుందని, వేలాది మందికి ఉపాధి కల్పించబడు తుందన్నారు. ఆయన మాట్లాడుతూ నాలుగుదశాబ్దాలపాటూ నమ్మి మోసపోయిన ప్రజలకు మంచి చేసేందుకు తన తండ్రి ఎంతో ఉన్నతాశయాలతో శ్రమిస్తున్నారన్నారు.అంతే కాకుండా పుంగనూరు పట్టణంలో ఏడు కిలోమీటర్ల దూరం రోడ్లను పూర్తిస్థాయిలో డివైడర్లతో రోడు ఆధునీకరించే కార్యక్రమాలకు కూడా త్వరలో పూజాకార్య క్రమాలు ప్రారంభిస్తామన్నారు. రోడ్లను ఆరేడునెలల్లో పూర్తి చేసి అందచేస్తామన్నారు. మంత్రి పెద్దిరెడ్డి, జిల్లాకలెక్టర్ హరినారాయణ, ఎంపి రెడ్డెప్ప,తితిదే సభ్యుడు పోకల అశోక్, పరిశ్రమల వ్యవ స్థాపకులు సురేష్ కండేల్వాల్, సిఓఓ సురేష్ కండేలా ్వల్,సిఎం దొరైరాజ్, రాష్ట్రజానపద కళల అకాడమీ ఛైర్మన్ కొండవీటి,మున్సిపల్‌ఛైర్మన్ అలీంబాషా, ఎంపిపి అక్కిసాని భాస్కరరెడ్డిలతో పలువురు భూమిపూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు.

## చిందేపల్లి రోడ్డు నిర్మాణంలో...
# ఫ్యాక్టరీకి ఎవరి మద్దతు?

**-తెలుగుదేశం ఆందోళనలో అర్థమేమిటి?**

(ఫైల్ పోటో)



శ్రీకాళహస్తిరూరల్, మార్చి 24 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి మండలంలోని రాచగున్నేరి వద్ద 1992 లో ఏర్పాటు అయిన లాంకో వద్ద చోటు చేసుకున్న అవతల గ్రామం చిందేపల్లికి వెళ్ళు మార్గంలో రోడ్డు నిర్మాణం జరగటానికి తెలుగుదేశం నాయకుల మద్దతు లేదా? అనేది చర్చనీయాంశంగా మారింది. ఇటీవల శ్రీకాళహస్తి నియోజకవర్గ తెలుగుదేశం ఇన్ చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి ఇక్కడ రోడ్డు నిర్మాణానికి సాహసించిన మేనేజ్‌మెంట్‌పై శివమెత్తారు. ఇక్కడ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసిన లగడపాటి రాజగోపాల్‌ను తెలుగుదేశంనేత నారా చంద్రబాబునాయుడు వద్ద సమావేశ పరుస్తానని తెలిపారు. యువనాయకుడు గ్రామస్తుల పట్ల చూపిన మద్దతు అభినందనీయమే.అయితే గోడ యువతల దేశం నాయకుడు సుధీర్‌రెడ్డి మద్దతు తెలిపితే గోడ నిర్మాణానికి ఫ్యాక్టరీకి మద్దతు లోపల ఉన్నది ఎవరన్నది ప్రశ్నార్థకంగా మారింది.

**మేనేజ్‌మెంట్‌ను సమర్థిస్తున్నది దేశం నాయకులు కాదా?**

శ్రీకాళహస్తి మండలంలోని రాచగున్నేరి వద్ద ప్రారంభించి నేడు ఇసిఎల్‌గా మనుగడ సాగిస్తున్న ఫ్యాక్టరీ మేనేజ్‌మెంట్ చేపట్టిన తరువాత కూడాఎలాంటి వివాదాలు లేకుండా పరిపాలన సాగుతూ వచ్చింది, ఈ మేనేజ్‌మెంట్ నీడల్లో తెలుగుదేశం పార్టీకి చెందిన మండల నాయకుడు చల్లపాళెంకు చెందిన నాయకుడు, అలాగే లోపల రాచగున్నేరి గ్రామ నాయకుడు కొనసాగుతున్నారు. ఇక్కడ కాంట్రాక్టర్ దగ్గర నుంచి ఏ లావాదేవిలు అయినావారి కనుసన్నల్లోనే మేనేజ్‌మెంట్ నిర్వహిస్తుంది. దేశం నాయకుడు బయట ఇది అన్యాయం అంటుంటే లోపల దేశం నాయకుల మద్దతు మేనేజ్ మెంట్‌కు ఉంది. గత మేనేజ్‌మెంట్ సారథ్యంలో చుట్టుపక్కల గ్రామాలకు మద్దతుగా ఉండేవారు. కానీ ప్రస్తుత మేనేజ్‌మెంట్‌కు దేశం మద్దతు దారులు మద్దతుగా ఉన్నారు.తమ పార్టీ వారిని కట్టుదిట్టంగా నిర్ణయాలు తీసుకుంటే నేడు చిందేపల్లి గ్రామస్తులకు సమస్య ఉండేది కాదు. గ్రామ స్థుల మీద తెలుగుదేశం పార్టీకి అవ్యాజ్యమైన గుర్తింపు ఉంటే మొదట లోపల మేనేజ్‌మెంట్‌కు మద్దతుగా ఉంటూ సలహాలు ఇస్తున్న వారి పరిస్థితి ఏమిటన్నది ఆత్మపరిశీలన చేసుకోవాలి.

**కోర్టులో సమస్య ఉంటే...**

చిందేపల్లికి సంబంధించిన రోడ్డు వివాదానికి సంబంధించిన వివాదం కోర్టు వివాదాల్లో ఉంది.అయితే ఈ అంశాన్ని దాచి పెట్టి జిల్లా కలెక్టర్‌ను తప్పు దారి పట్టిస్తూరికార్డులు సమర్పించి నట్లు చర్చించుకుంటున్నారు. ఈ వివాదంపై ఈ నెల 30న చర్చించాల్సి ఉండగా రోడ్డును నిర్మించటానికి జిల్లా అధికారులు ఎలా అనుమతించారన్నది చర్చనీయాంశంగా మారింది.కొత్త మేనేజ్‌మెంట్ బాధ్యతలు తీసుకున్న తరువాత రోడ్డు ప్రస్తావన రాలేదు. మరి ఇప్పుడు వచ్చినపుడు దేశం మద్దతు దారుల సూచనల్లేకుండా మేనేజ్‌మెంట్ సాహసిస్తుం దా? అనేది ప్రశ్నార్థకం. ఫ్యాక్టరీలో మేనేజ్‌మెంట్‌కు మూలస్థంభాల్లా దేశం మద్దతు దారులున్నారు.వారి సలహా లేనిదే మేనేజ్‌మెంట్ రోడ్డు నిర్మిస్తుందా? అనేది చర్చనీయాంశంగా మారింది.

## ట్రాఫిక్‌లో డివిజన్ల...
# తలనొప్పి !

**-అధికారుల "ఇగో"తో సిబ్బంది తంటాలు**

బాలాజీనగర్, ఆర్‌సిరోడ్డు, ఏఐఆర్ బైపాస్‌రోడ్డు, తిరుమలబైపాస్‌రోడ్డు, మాస్కురోడ్డు, తిలక్‌రోడ్డు ప్రాంతాల్లో ట్రాఫిక్ తంటాలు ప్రజలు ఎదుర్కొంటున్నారు. దీనికితగ్గట్లు గత కొంత కాలంగా నిర్మాణంలో ఉన్న శ్రీనివాససేతు పనులతో అన్ని మార్గాల్లో ట్రాఫిక్ లో నగరజనం గమ్యస్థానం చేరాలంటే ఇబ్బందులు తప్పడంలేదు. తిరుపతినగరం విస్తరిస్తుండటం, యాత్రాస్థలంగా ఉండటం, జిల్లాకేంద్రంగా మారడంతో వాహనాల రద్దీని నియంత్రించడంపై ట్రాఫిక్ పోలీసు అధికారులు దృష్టి సారించడం లేదనే విమర్శలు లేకపోలేదు. తిరుపతి నగరం లో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా ట్రాఫిక్ పోలీసుస్టేషన్ ఉంది. ఇక్కడ ఒక డిఎస్పీ అధికారి పర్యవేక్షణలో ఇద్దరు సిఐలు, ఐదారుమంది ఎస్‌ఐలు, వందమందికిపైగా సిబ్బంది, హోమ్‌గార్డులు కేటాయించారు. వీరంతా సిఐ స్థాయి అధికారి పర్యవేక్షణలో ఎస్‌ఐల సమన్వయంతో విధులు నిర్వహిస్తుం టారు. ఇటీవల తిరుపతిలో ట్రాఫిక్ పరిధిలో ఈస్టు,వెస్ట్ సబ్‌డివిజన్లుగా విభజించారు. అయితే వీరికి ఉన్న సిబ్బందిని విభజించారు. అంతేగాక అటాచ్‌మెంట్‌లో ఉన్న ట్రాఫిక్ అధికారులు పట్టుకోల్పోతున్నారనే విమర్శలు గుప్పుమంటు న్నాయి. ఏకంగా పోలీస్‌స్టేషన్ లోనే ఇద్దరు రైటర్‌లతో వ్యవహారం నడిపిస్తుండటం కూడా సిబ్బందికి అర్థంకాని అయోమయంలో ఉన్నారు. అందరూ కలసి సమన్వయంతో పనిచేయాల్సిన ట్రాఫిక్ విభాగం అధికారులు ఇగోలతో క్రిందిస్థాయి సిబ్బందిని ఇబ్బంది పెట్టేలా మారిందనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. అందరూ కలసి వాహనదారులు సహనం కోల్పోయేలా ట్రాఫిక్‌పై పట్టుకోల్పోయే ప్రమాదం లేకపోలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.





ప్రభాతవార్త-తిరుపతి:
"కొండ నాలుకకు మందేస్తే ఉన్ననాలుక ఊడిందనే" చందంగా తిరుపతి నగరంలో తీవ్రమవుతున్న ట్రాఫిక్ పద్మవ్యూహ సమస్యను సమన్వయంతో... అవగాహనతో అధిగమిం చాల్సిన ట్రాఫిక్ పోలీసు అధికారులు కొత్తగా డివిజన్‌ల తలనొప్పులు పెట్టుకున్నారని గుప్పుమంటోంది. రోజురోజుకూ నగరంలో పెరిగిపోతున్న వాహనాల సంఖ్యకు తగ్గట్లు యాత్రికుల తాకిడి అధికమవుతోంది. దీనికితోడు తిరుపతి,తిరుమలకు వచ్చే ప్రముఖుల బందోబస్తులు, రోడ్లపై ట్రాఫిక్ ఆంక్షలు వెరసి నగరప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పుడు తాజాగా ఇరవైరోజులుగా తిరుపతి ట్రాఫిక్‌లో తలెత్తిన డివిజన్‌ల సమస్యతో క్రిందిస్థాయి సిబ్బంది కూడా అయోమయానికి గురవుతున్నారు. ఎవరు ఎక్కడ ట్రాఫిక్ పాయింట్లలో డ్యూటీ చేయాలనే విషయం అర్థంకాక తలలుపట్టుకుంటున్నారు. అసలే నగరంలో చాలావరకు వెడల్పుకాని ఇరుకురోడ్లు, కనీసం పార్కింగ్ లేని వ్యాపార ప్రాంతాలు, పాదచారులు కూడ వెళ్ళలేని స్థితిలో నగరం రద్దీగా తయారైంది. ఉదయం వేళ, సాయంత్రం సమయంలో నగరంలోని ప్రధాన రోడ్లన్నీ వాహనాలతో ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది. ప్రధాన వ్యాపారమార్గాలున్న గాంధీరోడ్డు, బజారువీధి, తీర్థకట్టవీధి, ప్రకాశం రోడ్డు,

## నాణ్యమైన వైద్యం, నిష్ణాతులైన వైద్యులను...
# అందించడమే పిఇఎస్ లక్ష్యం

**- పిఇఎస్ వర్సిటీ ఛాన్సలర్ డా॥ ఎంఆర్ దొరస్వామినాయుడు**
**-215మంది వైద్యవిద్యార్థులకు పట్టాలు ప్రదానం - ఘనంగా స్నాతకోత్సవం..**



జ్యోతిప్రజ్వలన చేస్తున్న పిఇఎస్ యూనివర్సిటీ ఛాన్సలర్ డా॥ ఎంఆర్

కుప్పం, మార్చి 24 ప్రభాతవార్త : ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడంతో పాటు నిష్ణాతులైన వైద్యులను సమాజానికి అందించడమే పిఇఎస్ వైద్య కళాశాల లక్ష్యమని పిఇఎస్ యూనివర్సిటీ ఛాన్సలర్, కర్ణాటక ప్రభుత్వ విద్యారంగ సలహాదారు డా॥ ఎంఆర్ దొరస్వామి నాయుడు పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం పిఇఎస్ ఆడిటోరియంలో 15వ స్నాతకోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పిఇఎస్ ఛాన్సలర్ డా॥ దొరస్వామి, ముఖ్యఅతిథిగా విచ్చేసిన దేశంలోనే ప్రసిద్ధి చెందిన ప్రముఖ కార్డియో థొరాసిక్ సర్జన్ డా॥ వివేక్ జావళి జ్యోతి ప్రజ్వలన చేసి స్నాతకోత్సవంను ప్రారంభించారు. ఈసందర్భంగా ఛాన్సలర్ డా॥ ఎంఆర్ దొరస్వామి నాయుడు మాట్లాడుతూ ఈ ఏడాది వైఎస్సార్ ఆరోగ్య యూనివర్సిటీ విడుదల చేసిన ఫలితాల్లో పిఇఎస్ వైద్య కళాశాల రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ వైద్య కళాశాలలకంటే ఉత్తమ ఫలితాలు సాధించిందన్నారు. రాష్ట్రంలోనే తమ విద్యార్థులు ర్యాంకులు సాధించడం ఆనందంగా ఉందన్నారు. ముఖ్యఅతిథి డా॥ వివేక్ జావళి మాట్లాడుతూ కుప్పం లాంటి గ్రామీణ ప్రాంతంలో వైద్య కళాశాలను స్థాపించి విద్యార్థులకు అత్యున్నత విద్యను అందించడం సామాన్యమైన విషయం కాదన్నారు. వైద్య విద్యార్థులు క్రమశిక్షణ, సమయపాలనలో వైద్యం అందించి సమాజంలో మంచి వైద్యులుగా స్థిరపడాలని సూచించారు. అసోసియేట్ మెడికల్ డైరెక్టర్ డా॥ రూప సురేష్ మాట్లాడుతూ పట్టభద్రులైన విద్యార్థులను అభినందించారు. ప్రపంచంలో ఏదేశానికి వెళ్లినా అక్కడ పిఇఎస్ విద్యార్థులు వైద్యులుగా స్థిరపడడం గర్వకారణంగా ఉందన్నారు. డీన్ మరియు ప్రిన్సిపాల్ డా॥ హెచ్‌ఆర్ కృష్ణారావు మాట్లాడుతూ టెక్నాలజీని వాడుతూ వైద్య పరీక్షలు చేయడంలో భారతదేశం అత్యున్నతస్థానంలో ఎదుగుతోందని ఆ రీతిలోనే తాము విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ సందర్భంగా 1560మంది ఎంబిబిఎస్, 65మంది పి.జి. విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. విద్యార్థులు చేపట్టిన సా ంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో మెడికల్ సూపరింటిండెంట్ డా॥ చెన్నబసవ పాటిల్, డా॥ విశ్వేశ్వర్‌రెడ్డి, హెచ్‌ఓడిలు, విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

**రంజాన్ వేళలు**
**ఉపవాసదీక్ష-1 -తేదీ: 24.03.2023 శనివారం**
**శ్రీకాళహస్తి:-ఇఫ్తార్ సాయంత్రం 6.25 ఆదివారం సహారి:-ఉదయం 4.59**

## టెన్త్ పరీక్షల నిర్వహణకు పక్కా ఏర్పాట్లు : కలెక్టర్



చిత్తూరు, మార్చి 24 ప్రభాతవార్త: ప్రశాంత వాతావరణంలో టెన్త్ పరీక్షల ను పక్కాగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేపట్టి పూర్తి చేయాలని కలెక్టర్ హరి నారాయణన్ అధికారులను ఆదేశిం చారు. టెన్త్ పరీక్షల నిర్వహణ ఏర్పా ట్లపై శుక్రవారం చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో టెన్త్ పరీక్షల చీఫ్ సూపరి టెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, కస్టోడియన్లకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణా తరగతులకు ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ 2023 టెన్త్ పరీక్షలను పకడ్బం దీగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా, పూర్తి బాధ్యతతో అప్రమత్తంగా పరీక్షలను నిర్వహించి పూర్తి చేయాలన్నారు. ఏప్రిల్ 3 నుండి 18వ తేదీ వరకు జరుగనున్న టెన్త్ పరీక్షలను సమర్థ వంతంగా నిర్వహించడానికి పక్కా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. పరీక్షా కేంద్రంలో పూర్తి బాధ్యత చీఫ్ సూపరిటెండెంట్‌దేనని స్పష్టం చేశారు. విద్యాశాఖకు రెవెన్యూ, పోలీసులు శాఖలు సమన్వయంతో టెన్త్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలన్నారు. సీల్డ్ ప్రశ్నాపత్రాలు బండిల్స్‌ని నిర్ణీత సమయంలో ఓపెన్ చేయడం, వాటిని ఇన్విజిలేటర్స్‌కు అందించడం తదితరాలను పూర్తి బాధ్యతతో చేపట్టాలన్నారు. ఇన్విజిలేటర్లతో సహా ఏ ఒక్క విద్యార్థి సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రా నిక్ పరికరాలను పరీక్షా కేంద్రంలోకి తీసుకెళ్ళరాదని ఈ విషయంను కచ్చితంగా చీఫ్ సూపరి టెండెంట్లు పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. డిఇఓ విజయేంద్రరావు మాట్లాడుతూ టెన్త్ పరీక్షల నిర్వహణకు రిసోర్స్ పర్సన్ల శిక్షణ ద్వారా అవగాహన పెంచుకొని పరీక్షలను పకడ్బందీగా నిర్వహిం చడానికి చర్యలు తీసుకోవాలన్నారు. సమగ్ర శిక్ష ఎపిసి వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థు లకు టెన్త్ పరీక్షలు కీలకమైనవని, విద్యార్థులు ఎలాంటి భయాందోళనలకు గురి కాకుండా పరీక్షా విధానంపై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో డివైఇఓ చంద్రశేఖర్, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

## నేటి ఉదయం 8.30గంటల నుంచే...
# ఎల్‌విఎం3 రాకెట్‌కు కౌంట్‌డౌన్

**- రేపే ప్రయోగం**





శ్రీహరికోట (తడ), మార్చి 24 ప్రభాతవార్త : శ్రీహరికోటలో ఎల్‌విఎం3 రాకెట్ ప్రయోగ సందడి మొదలైంది. శుక్రవారం కీలకమైన ఎంఆర్‌ఆర్, ఎల్‌ఎబి సమావేశాలు నిర్వహిం చారు. షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ ఆధ్వర్యంలో స్థానిక బ్రహ్మప్రకాష్ హాలులో మిషన్ రెడీనెస్ రివ్యూ సమావేశం శుక్రవారం ఉదయం జరిపారు. అనంతరం ఈ సమా వేశంలో నిర్ణయాలను లాంచ్ ఆథరేజేషన్ బోర్డుకి అప్పగించారు. భాస్కర అతిథిగృహంలో జరిగిన ఎల్‌ఎబి సమావేశంలో ఇస్రో కేంద్రాల డైరెక్టర్లు, సీనియర్ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. ముందుగా అనుకున్నట్లే ఆదివారం ఉదయం 9 గంటలకు భారత బాహుబలి రాకెట్ ఎల్‌విఎం3ని ప్రయోగిం చాలని ఈ సమావేశాల్లో నిర్ణయం తీసుకున్నారు. అంతకు 24.30 గంటల ముందు శనివారం ఉదయం 8.30 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభించ నున్నారు. ఈ కౌంట్‌డౌన్‌లో ఎల్‌విఎం3 రాకెట్‌లోని రెండవ దశలో 110 టన్నుల ద్రవ ఇంధనం నింపుతారు. ఇదిలావుంటే శ్రీహరికోటలో రాకెట్ ప్రయోగ వీక్షణకు ఈ సారి కూడా వేలసంఖ్యలో సందర్శకులు తరలి వస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నానికి 7800 మంది ఆన్‌లైన్‌లో తమ పేర్లు నమోదు చేసుకున్నట్లు తెలిసింది. ఉదయం పూట ప్రయోగం కావడం, అతిపెద్ద రాకెట్‌ను ప్రయోగిస్తున్న కారణంగా షార్‌లోని విజిటర్స్ గ్యాలరీ నుంచి ప్రయోగ దృశ్యాలు స్పష్టంగా కనిపిస్తాయని నమ్ముతున్నారు.

## ఈ సారి ఎన్నికల్లో...
# ఎస్‌సివి పోటీ చేయటం తథ్యమా!

**శ్రీకాళహస్తి రాజకీయంలో కదలికలు!**



శ్రీకాళహస్తి,మార్చి 24 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి రాజకీయంలో రాబోవు ఎన్నికల్లు ఉత్కంఠత నెలకొనే టట్లు వాతావరణంగా మారనున్నదా!. అయితే గతంలో శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఏ ఎన్నికలు జరిగినా ముఖాముఖి పోటీయే జరిగేది. గత 40 సంవత్సరాల నుంచి ఇలాగే జరుగుతుంది. అయితే ఈ సారి అందుకు భిన్నంగా ఎన్నికలు జరిగే అవకాశం ఉందనే అభిప్రాయాన్ని రాజకీయ పరిశీలకులు వ్యక్తపరస్తున్నారు. ఈ సారి ఎన్నికల్లో మాజీ శాసనసభ్యుడు ఎస్‌సివి నాయుడు పోటీ చేయటం తథ్యం అని ఆయన సన్నిహితులు, అనుచరులు వ్యక్తపరస్తున్నారు. ఇప్పటికే శ్రీకాళహస్తి,సత్యవేడు నియోజక వర్గాల నుంచి కొందరు నాయకులు ఆయన వద్దకు వచ్చి మద్దతు కోరుతుండగా ఆయన మాత్రం ఈ సారి ఎవరిని మద్దతు ఇచ్చి గెలిపించే ప్రసక్తి లేదని, ఈ సారి ఎన్నికల్లో తాను పోటీ చేయటం తథ్యమని సంకేతాలు ఇచ్చినట్లు సమాచారం.

**అనుచరవర్గం కల్గిన నాయకుడు:**

శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యుడుగా ఎస్‌సివి నాయుడు 2004- 2009లో పని చేసారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను తన సమస్యలుగా పరిష్కరించారు. ఆయన హయాంలో డాక్టర్ వైయస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా రాజీవ్‌నగర్‌లో 7వేల ఇళ్ళను ఇంటిస్థలాలను మంజూరు చేసారు. శ్రీకాళహస్తి నియోజకవర్గానికి 50వేల ఇళ్లు మంజూరు చేసారు. అంతేకాక ఇళ్లు నిర్మించుకునే వారికి ఎస్‌సివి నాయుడు ఇతోధిక సహాయ సహకారాలతో పాటుగా, నిజాయితీ పాలన అందించారని అనుచరులు అంటున్నారు. అంతేకాక 1983నుంచి నియోజకవర్గంలో నాయకుడుగా తన బ్రాండ్‌ను రూపొందించుకున్నారని. శ్రీకాళహస్తి,సత్యవేడు, సూళూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాల్లో వర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారనే విషయాన్ని సన్నిహితులు చెబుతున్నారు. సత్యవేడు నియోజకవర్గంలో ఎదరులేని నాయకుడుగా నేటికి చక్రం తిప్పుతూ, 2019 ఎన్నికల్లో చివరి వరకు తెలుగుదేశం పార్టీ అధినాయకుడు ఎస్‌సివికే టిక్కెట్టు అని రంగం సిద్ధం చేసుకోమని ఊరించామని, కానీ చివరి నిముషంలో మొండిచేయి చూపారన్నారు. దాంతో ఆయన తీవ్రనిరాశకు గురై, తన అనుచరులు, అభిమానుల కోరిక మేరకు ప్రస్తుత అధికార వైకాపాలో పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరి, 3 నియోజకవర్గాల్లో ప్రచారం నిర్వహించి పార్టీ విజయానికి కృషి చేశారని తెలిపారు.అయితే రెండు సార్లు జిల్లాకు చెందిన 'పెద్దాయన' ఎంఎల్‌సి సీటు నీకే అంటూ నమ్మపలికి, వారే కాకుండా ముఖ్యమంత్రి కూడా పలుమార్లు భుజం తట్టి చిరునవ్వుతో అన్నకే అంటూ భరోసా ఇచ్చారన్నారు. అయితే ఒక సారి కుప్పం ఎన్నికల దృష్ట్యా ఆ ప్రాంతానికి ఇటీవల తిరుపతికి చెందిన మరొకరికి ఎంఎల్‌సిలను చేసారు. దాంతో మౌనం వహించిన ఆయన పెదవి విప్పటం లేదన్నారు.

**పోటీ చేయటం తథ్యం: అనుచరవర్గం**

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఓ బ్రాండ్‌గా ఉన్న ఎస్‌సివి నాయుడు రాబోవు ఎన్నికల్లో పోటీ చేయాలని అనుచరులు పట్టుపడుతున్నట్లు సమచారం. అంతేకాక పార్టీలతో ప్రమేయం లేకుండా కొందరు నాయకులు ఎస్‌సివిని కలసి ప్రోత్సహిస్తున్నట్లు చర్చించుకుంటున్నారు. ఆయన కూడా ఈ సారి ఎవరికి మద్దతు ఇచ్చేది లేదని స్పష్టం చేసినట్లు అంటున్నారు. అయితే జనంతో సత్‌సంబంధాలు కల్గిన మాజి సర్పంచ్ ఒకరు తాను ఎన్నికల బరిలో ఉంటానని ఇప్పటికే నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించి, ప్రచారం చేసుకుంటున్నారు. అయితే ఎస్‌సివి నాయుడు ఏ రాజకీయ పార్టీ నుంచి పోటీ చేస్తారన్నది బహిర్గతం చేయటం లేదు. కానీ పోటీ తథ్యమని అంటున్నారు. మరి ఆయన పోటీ చేస్తే ఎవరికి లాభం? ఎవరికి నష్టం అనేది రాజకీయ పరిశీలకుల్లో చర్చనీయాంశంగా ఉంది.

## మత సామరస్యానికి ప్రతీక రేణిగుంట



**రేణిగుంట, మార్చి 24 ప్రభాతవార్త:** రేణిగుంట పట్టణ మతసామరస్యానికి నిలువెత్తు నిదర్శనంగా అందరి మన్ననలను పొందుతుందని ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి అన్నారు. రేణిగుంట పట్టణంలోరంజాన్ నెల పర్వదినాలను పురస్కరించుకుని రంజాన్ హైదర్ అబుదాయి ఇరానీ మటన్ చికెన్ హలీం సెంటర్‌ను శుక్రవారం ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు 40 శాతం వరకు ముస్లిం మైనారిటీలు రేణిగుంట పట్టణంలో నివసిస్తున్నారన్నారు. ఎలాంటి తారతమ్యాలకు అవకాశాలు ఇవ్వకుండా రేణిగుంట పట్టణాన్ని భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా అందరితో కలసి సోదరుభావంతో మెలగి ఇతర ప్రాంతాలకు ఆదర్శంగా ఉన్నారన్నారు. ప్రారంభోత్సవంలో తిరుపతి జిల్లా వైసీపీ ముస్లిం మైనారిటీ అధ్యక్షుడు మహ్మద్ రసూల్, వైసీపీ సీనియర్ నేత దయాకర్‌రెడ్డి, రేణిగుంట సర్పంచ్ నాగేషం, పట్టణ వైసీపీ అధ్యక్షుడు ప్రభాకర్, మర్రి మంద మాజీ ఎంపీటీసీ మస్తాన్, హలీం సెంటర్ నిర్వాహకులు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

**రేణిగుంట, మార్చి 24 ప్రభాతవార్త:** కొత్త కాంట్రాక్టర్ నిలిపేసిన సీఆర్ఎస్ హౌస్ కీపింగ్ క్లీనింగ్ కాంట్రాక్టు కార్మికులను పనిలోకి తీసుకోవాలని సీఆర్ఎస్ వర్క్‌షాప్ మేనేజర్‌కు సీఐటీయూ మండల అధ్యక్షుడు నరసింహారెడ్డి వినతిపత్రం ఇచ్చారు. దాదాపు 16 ఏళ్లుగా పని చేస్తున్న మహిళలా కాంట్రాక్టు కార్మికులను ఏ విధమైన సమాచారం లేకుండా నిలిపి వేయడం దారుణమన్నారు. ఏ లోపాలు లేకుండా శ్రద్ధగాపని చేస్తున్న వారిని పనిలోకి తీసుకోకపోవడం వింతగా ఉందన్నారు. వెంటనే నిలిపి వేసిన 30 మంది కార్మికులను తీసుకోవాలని వర్క్‌షాప్ మేనేజర్‌కు వినతిపత్రం ఇచ్చిన వారిలో నరసింహారెడ్డి, వెంకటరమణ, కార్మికులు అమ్ములు, చంద్రకళ, మునెమ్మ తదితరులు ఉన్నారు.

## కోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం

– బీజేపీ తిరుపతి జిల్లా ఓబీసీ అధ్యక్షుడు

**రేణిగుంట, మార్చి 24 ప్రభాతవార్త:** రాహుల్‌గాంధీపై కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని తిరుపతి జిల్లా బీజేపీ ఓబీసీ అధ్యక్షుడు బీడీ బాలాజీ అన్నారు. గత నాలుగు సంవత్సరాల క్రితం ఓ బహిరంగ సభలో రాహుల్ గాంధీ చేసిన అనుచిత వ్యాఖ్యలకు కోర్టు ఇచ్చిన తీర్పు అందరికి గుణపాఠం కావాలన్నారు. ఎంత పెద్ద వ్యక్తికైనా భారత రాజ్యాంగంలో న్యాయ వ్యవస్థ సమానంగా పని చేస్తుందని తీర్పు రుజువు చేసిందన్నారు. తప్పు చేస్తే శిక్ష తప్పదని ఈ తీర్పు తెలియచేసిందన్నారు.

## డిప్యూటీ మేయర్‌ని కలసిన శెట్టిపల్లి నాయకులు



**తిరుపతిసిటీ, మార్చి24ప్రభాతవార్త :** డిప్యూటీమేయర్ భూమన అభినయ్‌రెడ్డిని కలసి శెట్టిపల్లి వైఎస్సార్సీపి నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. శెట్టిపల్లిగ్రామం తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్‌లో విలీనం అయిన సందర్భంగా అభినయ్‌ని కలసి కృతజ్ఞతలుతెలిపారు. కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి చేసుకుందాం అని చర్చించారు. ఇందులో నాయకులు రుయా వర్కింగ్ కమిటీ చైర్మన్ బండ్లచంద్రశేఖర్, బాలమురళికృష్ణ, బత్తెనబాబు, శంకర్, ఉపసర్పంచ్‌రామకృష్ణ, మునిబాబు, చెంచయ్య, రాంమూర్తి పాల్గొన్నారు

## వరాలను అందుకోండి:ఆధ్యాత్మిక చింతనతో నడవండి

–రంజాన్ మాసం మొదటి శుక్రవారం



**శ్రీకాళహస్తి, మార్చి 24 ప్రభాతవార్త :** రంజాన్ మాసం మిగిలిన 11 మాసాల కన్నా భిన్నమైంది. అల్లాహ్ ఈ మాసంలో వరాల జల్లులు కురిపించారని వాటిని అందుకోకుంటే ఇతర దురదృష్టవంతులు మరోకరుండరని జామియా మస్జిద్‌లో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనల అనంతరం జరిగిన ఉపన్యాసంలో హాఫీజే ఖుర్ అన్ రేహాన్ పిలుపు నిచ్చారు. రంజాన్ మాసం మొదటి రోజు రాత్రికి ఎంతో ప్రాధాన్యత ఉందని వివరించారు. రంజాన్‌మాసంలో స్వర్గపు తలుపులు తెరచుకుంటాయని, నరకం ద్వారాలు మూసివేస్తారని, దైవ దూతలు అల్లాహ్ వద్ద ప్రార్థించమని కోరుతారని మనం తెలిసి తెలియక చేసిన తప్పిదాల క్షమాపణ కోరటానికి రంజాన్‌మాసం ఎంతో మహోన్నతమైనదన్నారు. ఈ మాసంలో ఒక్కొక్క నఫిల్ నమాజుకు 70 వంతులు అదనపు పుణ్యలభిస్తుందని, అంతేకాక మనం చేసే దాన ధర్మాల్లో సాధారణ రోజుల్లో ఒక వంతు పుణ్యం లభిస్తే రంజాన్‌మాసంలో 70వంతుల పుణ్యం లభిస్తుందన్నారు. ముస్లిం సమాజం, ఇస్లాం నిరుపేదల పట్ల దయ కల్గి ఉండాలని సూచిస్తుంది. మనం రంజాన్‌మాసంలో కూడా ఇఫ్తార్ విందులు ఎవరికి ఇస్తున్నామో? ఒక సారి ఆత్మపరిశీలన చేసుకోండి. మన కంటే సంపన్నులకు సంతృప్తి పరచటానికి ప్రయత్నిస్తాం తప్ప నిరుపేద ఆకలి దప్పులను గుర్తించలేకపోతున్నామని కన్నీటి పర్యంతమై వివరించారు. మనం ఇచ్చే దాన ధర్మాలు ఇస్లాం మత సిద్ధాంతాలకు అనుగుణంగా ఉండాలని పలు సూచనలు చేసారు. ఇక ముస్లింలు ఆచరించాల్సిన కొన్ని నిబంధనలను, జకాత్(దానం) గురించి వివరించారు.

## పదవ తరగతివిద్యార్థులకు సామగ్రి వితరణ



**శ్రీకాళహస్తి రూరల్, మార్చి 24 ప్రభాతవార్త :** శ్రీకాళహస్తి మండలంలోని రాచగున్నేరి పాఠశాలలో నిర్వహించిన సరస్వతి పూజల్లో మాజీసర్పంచ్ బొల్లినేని జగన్నాదం నాయుడు పాల్గొన్నారు. శుక్రవారం గున్నేరి ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమాలకు జగన్నాదం నాయుడు ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. పదవ తరగతి పరీక్షలు హాజరయ్యే విద్యార్థులకు జగన్నాథం నాయుడు పరీక్షా సామగ్రి అందించారు. గ్రామ పెద్ద మస్తానయ్య, రిటైర్డ్ స్టేషన్‌మాస్టర్ భక్తవత్సల నాయుడు, ప్రధానోపాధ్యాయుడుగోపాలకృష్ణ, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కాళికా దేవికి ప్రత్యేక అభిషేకాలు



**శ్రీకాళహస్తి, మార్చి 24 ప్రభాతవార్త :** శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రతి రోజూ ఒక్కొక్క పరివార దేవతకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో శుక్రవారం దక్షిణ గోపురానికిసమీపంలోఉన్న కాళికామాత ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలుహోమాలునిర్వహించారు. ఇక్కడనిత్యం చండీహోమాలు నిర్వహించటం ఆనవాయితి, శ్రీకాళహ స్తీశ్వరాలయంలో సేవలను పెంచుతూ భక్తులను రాబట్టుకొనుటకు ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నారు. శుక్రవారం అమ్మవారికి ప్రత్యేకం. కాబట్టి కాళికామాతకు అభిషేకాలు, హోమాలు నిర్వహించ టకు నిర్ణయించారు. శుక్రవారంనాటిపూజలు, హోమాలకు వేదపండితులు శ్రీనివాసశర్మ, గురుకుల్ బాబూ పాల్గొన్నారు.

## క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ



**శ్రీకాళహస్తి, మార్చి 24 ప్రభాతవార్త :** ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా శ్రీకాళహస్తి మెడికల్‌సూపరింటెండెంట్ డాక్టర్ ప్రసన్న మరియు డాక్టర్ ఆర్‌సియం. రెడ్డి రామకృష్ణయ్య ఎస్‌టిఐఎస్ మరియు వైద్యసిబ్బంది సారధ్యంలో ర్యాలీ నిర్వహించారు. వీరు మాట్లాడుతూ రెండువారాలకు మించి దగ్గు ఉండడం రక్తం పడడం, తరచుగా జ్వరం రావడం, చాతీలో నొప్పి రావడం, బరువు తగ్గడం, ఆకలిమందగించడం తదితర లక్షణాలుక్షయవ్యాధిగా తెలియజేయడం జరుగుతుందన్నారు. క్షయవ్యాధిగ్రస్తులు ఆరునెలల పాటు మందులువాడితే పూర్తిగా క్షయ వ్యాధి నయమవుతుందని వారికి రూ.500 చొప్పున పోషకాహారం కోసం నగదుబ్యాంకుఖాతాలోజమచేయబడుతుందన్నారు. కార్యక్రమంలోఏరియా ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు. **అర్బన్ ప్రైమరీ హెల్త్‌సెంటర్ ఆధ్వర్యంలో..** ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా అర్బన్ ప్రైమరీ హెల్త్‌సెంటర్‌లో డాక్టర్ జావీద్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. క్షయవ్యాధి ఒక అంటువ్యాధి అని ఇది మైకోబ్యాక్టీరియం ట్యుబర్క్యులోసి అనే బ్యాటీరియా ద్వారా వ్యాప్తి చెందుతుందన్నారు. ఈవ్యాధి యొక్క లక్షణాలు రెండు వారాలకు మంచి దగ్గు, జ్వరం, శరీర బరువు తగ్గడం వంటివి ఉంటాయన్నారు. ఈవ్యాధిగ్రస్తుని నోటి తుంపర్ల ద్వారా ఒకరి నుంచి ఒకరికి గాలి ద్వారా వ్యాప్తిచెందుతుందని దీనికి ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా చికిత్స లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఉన్నత లక్ష్యం అవసరం



**శ్రీకాళహస్తిరూరల్, మార్చి 24 ప్రభాతవార్త :** విద్యార్థులకు ఉన్నత లక్ష్యం అవసరమని జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ రాష్ట్రడిప్యూటీ చైర్మన్ యల్లంపాటి కోటేశ్వరబాబు అన్నారు. జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని ఓబులాయపల్లి, ముచ్చి వోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీచేశారు. ఇందులో భాగంగా విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు, ఇతర విద్యాసామగ్రిని అందించారు. కార్యక్రమంలో ఎన్‌సిఆర్‌సి మహిళా విభాగం ఏపి డిప్యుటీ చైర్‌పర్సన్ బండారు సుచరిత, పబ్లిక్ రిలేషన్ అధికారి వేణుగోపాల్‌రెడ్డి, అక్కుర్తి ప్రధానోపాధ్యాయులు కృష్ణయ్య, ఓబులాయపల్లి ప్రధానోపాధ్యాయులు అంబటిబాలయ్య, ముచ్చివోలు ప్రధానోపాధ్యాయులు గోపి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జాతీయ మెరిట్ ఉపకార వేతనానికి ఎంపిక



**శ్రీకాళహస్తి రూరల్, మార్చి 24 ప్రభాతవార్త :** శ్రీకాళహస్తి మండలం ఓబుళాయిపల్లిలో విద్యాకుసుమాలు విరబూస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల జాతీయ మెరిట్ ఉపకార వేతన పోటీ పరీక్షల్లో ఓబుళాయిపల్లికి చెందిన ఓ విద్యార్థి పాల్గొని తమ సత్తా చాటింది. శ్రీకాళహస్తి పేరు ప్రతిష్టలను మిక్కిలి ఇనుమడింపజేసింది. 2022-2023 సంవత్సరానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన పోటీల్లో శ్రీకాళహస్తిలోని ఆర్‌పిబియస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఓబుళాయిపల్లికి చెందిన సి.విష్ణు ప్రసన్న 8వ తరగతి చదువుతోంది. జాతీయ ఉపకారవేతన పథకానికి నిర్వహించిన పోటీ పరీక్షల్లో పాల్గొని విజయంసాధించింది. ఈసందర్భంగాపాఠశాలలోశుక్రవారం అభినందన సభను ఏర్పాటు చేసారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ.బాలయ్య ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొని విద్యార్థిని అభినందించారు.

## మద్యం మత్తులో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తికి జైలు శిక్ష!

**సత్యవేడు, మార్చి 24,ప్రభాతవార్త:** మద్యం మత్తులో అసభ్యకరంగా ప్రవర్తించిన మునస్వామి అనేవ్యక్తిపై సత్యవేడులో ఎస్ఐ పురుషోత్తం రెడ్డి కేసు నమోదు చేశారు. కోర్టు నందు హాజరు పరచగా ముద్దాయికి న్యాయమూర్తి ఒకరోజు జైలు శిక్షను విధించినట్లుగా ఎస్ఐ తెలిపారు. ఎవరైనా అతిగా మద్యం సేవించి అనుచితంగా నడుచుకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని ఈసందర్భంగా హెచ్చరించారు.

## రాహుల్‌పై తప్పుడు కేసులు వేయడం దుర్మార్గం



**తిరుపతి ప్రెస్‌క్లబ్, మార్చి 24 ప్రభాతవార్త:** కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు రాహుల్ గాంధీ చేసిన భారత్ జోడో పాదయాత్రకు ప్రజల నుండి వచ్చిన ఆదరణ చూసి ఓర్వలేక బిజెపి ప్రభుత్వం కర్ణాటక రాష్ట్రంలోని ఓ వ్యక్తి ద్వారా తప్పుడు కేసులు వేయించడం దుర్మార్గమని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు కొండేటి లీలా శ్రీనివాస్ శుక్రవారం ఓ ప్రకటనలో మండిపడ్డారు. ఎప్పుడో 2019లో ఒక బహిరంగ సభలో రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోడీని తప్పుగా ఒక మాట అన్నందుకు ఇప్పుడు ఒక మాజీ ఎమ్మెల్యే సూరత్ న్యాయస్థానంలో కేసు వేస్తే, దానిని సీరియస్‌గా తీసుకున్న కోర్టు రాహుల్‌కు రెండేళ్ల జైలు శిక్ష వేయడం జరిగింది. నెలలోపు తన తప్పు ఏమీ లేదని రాహుల్ నిరూపించుకోవాలని న్యాయ నిర్ణేతలు తీర్పు ఇచ్చారు. ప్రజల కోసం కేసులు ఎదుర్కోవడం, జైళ్లకు వెళ్లడం రాహుల్ గాంధీ కుటుంబానికి కొత్తేమీ కాదన్నారు.

## లయన్స్ క్లబ్‌చే విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ



**తిరుపతి ప్రెస్‌క్లబ్, మార్చి 24 ప్రభాతవార్త:** పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే స్థానిక చిన్నబజారువీధిలోని ప్రభుత్వ పాఠశాలకు చెందిన 100 మంది బాలికలకు లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి సెవెన్ హిల్స్ ఆధ్వర్యంలో నోట్ బుక్స్, ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు, తదితర పరీక్ష సామాగ్రిని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్, కార్యదర్శి జగన్నాథంలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 37వ వార్డు కార్పొరేటర్ బస్వా గీత విచ్చేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ తాను చదువుకున్న పాఠశాల కార్పొరేటర్‌గా ప్రాతినిధ్యం వహిస్తున్న తన వార్డులో ఉండటం తన అదృష్టంగా భావిస్తున్నాని అన్నారు. అనంతరం ఆర్కాట్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలోమహిళలు అన్ని రంగాలలో ముందుండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కోశాధికారిబెల్లంకొండసురేష్, కార్యదర్శిజగన్నాథం, బాసిఆకర్లరఘు, రామారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలువెంకటసుబ్బమ్మ, ఉపాధ్యాయినులుపారిజాతం, విమల, భారతి, రుక్మిణి, సుకుమారి, పాల్గొన్నారు.

## గ్రంథాలయ కార్యదర్శిగా వై.షణ్ముగం యాదవ్



**తిరుపతి ప్రెస్‌క్లబ్, మార్చి 24 ప్రభాతవార్త:** తిరుపతి బార్ అసోసియేషన్ గ్రంథాలయ కార్యదర్శిగా న్యాయవాది వై.షణ్ముగం యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు తిరుపతి బార్ అసోసియేషన్ ఎన్నికల అధికారి గొట్టి రాజేంద్ర శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. తిరుపతి బార్ అసోసియేషన్ ఎన్నికలు ఈనెల 31వ తేదీ జరగనున్నాయని, దీని దృష్ట్యా 2023–24 సంవత్సరానికి అసోసియేషన్ ఎన్నికలకు నామినేషన్లు దాఖలు చేసిన పోటీ అభ్యర్థుల నామినేషన్లు, పోటీ చేసే అభ్యర్థుల నుండి ఉపసంహరణ లేదన్నారు. కావున గ్రంథాలయ కార్యదర్శిగా వై.షణ్ముగం యాదవ్, కోశాధికారిగా టి.చంద్రమోహన్, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శిగా ఆర్ఎన్‌పి.శ్రీనాథ్‌ప్రసాద్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని రాజేంద్ర పేర్కొన్నారు.

## దళిత క్రిస్టియన్స్ బిల్లు ఆమోదం చారిత్రాత్మక నిర్ణయం



**తిరుపతి ప్రెస్‌క్లబ్, మార్చి 24 ప్రభాతవార్త:** శుక్రవారం రాష్ట్ర అసెంబ్లీలో దళిత క్రిస్టియన్స్‌కు సంబంధించిన బిల్లును సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపాదించడం ఒక చారిత్రాత్మక నిర్ణయమని, దానిని శాసనసభ మొత్తం ఏకగ్రీవంగా ఆమోదించడం అభినందించదగ్గ విషయమని ఆంధ్రప్రదేశ్ బిషప్ కౌన్సిల్ చైర్మన్ డా॥యలమంచిలి ప్రవీణ్ కొనియాడారు. శుక్రవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ ఒక దళిత కుటుంబంలో ఇద్దరు బిడ్డలు ఉన్నప్పుడు ఒకరు అదే మతంలో ఉండి, ఇంకొక్కరు క్రైస్తవ మతాన్ని స్వీకరిస్తే.. ఆ రెండవ వ్యక్తికి రిజర్వేషన్ వర్తించదని, దళితులకు వచ్చే రాయితీలు రావని అనడం దుర్మార్గమన్నారు.

## ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు కల్పించిన చట్టబద్ధత ఉద్యోగులుకు కల్పించాలి

**వాకాడు, మార్చి 24, ప్రభాతవార్త :** ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు జీతాలు వ్యవహారంలో కల్పించిన చట్టబద్రత ప్రభుత్వ ఉద్యోగులకు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల అధ్యక్షుడు ప్రసాద్‌రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు. శుక్రవారం మండల కేంద్రంలో ఉన్న ఇరిగేషన్ ఇన్స్పెక్షన్ బంగ్లాలో వాకాడు తాలుకా యూనిట్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో వాకాడు తాలుకా యూనిట్ అధ్యక్షుడిగా ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ గాయం శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ నాడు పాదయాత్రలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉద్యోగులకు ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని కోరారు. వాకాడు తాలుకా యూనిట్ ప్రధాన కార్యదర్శి సుభాషిని, గ్రామ సచివాలయం జిల్లా కన్వీనర్ రమేష్, శ్రీనాథ్, రమేష్ రెడ్డి, కోట, వాకాడు చిట్టమూరు మండలాల ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ

**చిట్టమూరు, మార్చి 24 ప్రభాతవార్త :** చిట్టమూరు మండల పరిధిలోని అరవపాలెం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని శుక్రవారం పదవ తరగతి చదువుతున్న 50 మంది విద్యార్థి విద్యార్థినులకు పరీక్షలకు విద్యా సామాగ్రిని అందజేసారు. ఈ కార్యక్రమంలో సురేంద్ర, మాజీ ఎంపిపి హరీష్ కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు పరీక్షల భయం వీడాలి : ఎంపీపీ

**వెదురుకుప్పం, మార్చి 24 ప్రభాతవార్త :** పదవ తరగతి విద్యార్థులు పరీక్షల భయం వీడి ఆలోచించి పరీక్షలు రాయడం వలన ఉత్తమ ఫలితాలు సాధ్యమవుతాయని ఎంపీపీ బండి నాగరాణి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 58 వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు ధైర్యంగా పరీక్షలను ఎదుర్కోవాలని చూచించారు. సందర్భంగా ఎంపీపీ నాగరాణి, స్థానిక ఎంపీటీసీ పుత్తూరు రాధిక పురంధర్ రెడ్డిలను ఉపాధ్యాయులు దుశాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరమణా రెడ్డి, విశ్రాంతి పీడీ మునికృష్ణయ్య, ఉపాధ్యాయులు మురళీరెడ్డి, డాక్టర్‌బండిప్రభాకర్ రెడ్డి, విజయలక్ష్మీ, కమలనాథన్, విద్యార్థులు, తల్లీదండ్రులు పాల్గొన్నా రు.

## దళిత ద్రోహి చిట్టిబాబే – వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బట్టే సుబ్రమణ్యం

**వెదురుకుప్పం, మార్చి 24 ప్రభాతవార్త :** దళిత ద్రోహి, దగా కోరు ముమ్మాటికీ తెలుగు దేశం గంగాధర నెల్లూరు నియోజకవర్గం సమన్వకర్త చిట్టిబాబే అని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బట్టే సుబ్రమణ్యం విమర్శించారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నియోజకవర్గం అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న రాష్ట్ర డిప్యూటీ సీఎం నారాయణస్వామిని విమర్శించే అర్హత చిట్టిబాబుకు లేదన్నారు. డిప్యూటీ సీఎం పై అవాకులుచెవాకులు పెల్చితే తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.

## సిపాయి విద్యా దీవెన ప్రారంభం



**రేణిగుంట, మార్చి 24 ప్రభాతవార్త:** సిపాయి విద్యా దీవెన పథకాన్ని ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ డా. సిపాయి సుబ్రహ్మణ్యం శుక్రవారం రేణిగుంట బాలుర ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పండుగకు కొత్త బట్టలు వేసుకోవడం భారత సంస్కృతి అన్నారు. చదువుల తల్లి సరస్వతీదేవికి పూజలు చేసి తల్లిదండ్రులు దీవెనలతో పరీక్షలకు రాయడం ఆనవాయితీ చేసుకోవాలన్నారు. పదో తరగత పరీక్షలు రాయబోతున్న విద్యార్థులకు కొత్త ప్యాడ్, కలము, పెన్సిల్, ఏరేజర్, సార్కనార్ విద్యా సామగ్రి ఉచితంగా ఇస్తున్నట్లు తెలిపారు. పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో పాసైన విద్యార్థులకు బహుమతులు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన తిరుపతి జిల్లా విద్యాధికారి శేఖర్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలుసిపాయిఫౌండేషన్‌ద్వారా చేయడం వల్ల విద్యార్థుల్లో ఉత్సాహన్ని కలిగిస్తుందన్నారు. బహుమతులు ఇస్తామని ప్రకటించడం పోటీతత్వాన్ని పెంచి విద్యార్థులు జ్ఞాన సమపార్చనకు దోహద కారి అవుతుందన్నారు. మండల విద్యాధికారి ఇందిరాదేవి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్, న్యాయవాదితిరుమలరెడ్డి, ఉపాధ్యాయులు అల్లాబక్ష, రఘు ప్రసాద్, జనార్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాస్ ఉచిత పశు వైద్య శిబిరం



**రేణిగుంట, మార్చి 24 ప్రభాతవార్త:** రేణిగుంట మండలం బాలపల్లి గ్రామం మామండూరు పంచాయతీలో రాస్ మహిళా జ్యోతి మ్యూచువల్ బెనిఫిట్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం మెగా పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పరిసర ప్రాంత రైతులు పశువులు, జీవాలు, కోళ్ల తదితర ప్రాణులకు రేణిగుంట ఏరియా వెటర్నరీ ఆస్పత్రి డా. ప్రవంతి వైద్యసేవలు చేయడంతో శిబిరానికి విశేష స్పందన లభించింది. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యులు వివరించి, పశువులకు పరీక్షలు చేసి సూదులు, మందులు ఉచితంగా ఇచ్చారు. దీంతోపాటు వాటికి పురుగుల మందు తాగించడం, పిడుదులకు సంబంధించి మందును పిచికారి చేశారు. కార్యక్రమంలో క్లస్టర్ లీడర్లు, ట్రస్టీలు, ట్రస్టు సిబ్బంది, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

## క్షయ వ్యాధి రహిత సమాజం కోసం కృషి చేయాలి



**రేణిగుంట, మార్చి 24 ప్రభాతవార్త:** ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం రేణిగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని టీబీ యూనిట్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు చేయి చేయి కలుపుదాం టీబీని తరిమి కొడదాం వేయించుకో టీపీజీ టీకా నిరోధించు టీబీ, టీబీపై పోరాటం మనందరి బాధ్యత, మన పంతం టీబీ అంతం అనే నినాదాలు చేస్తూ రేణిగుంట వీధుల్లో అవగాహన ర్యాలీ చేశారు. ముందుగా ర్యాలీని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. ఛత్రప్రకాష్‌రెడ్డి ప్రారంభించారు. సూపర్‌వైజర్ సుమశ్రీ లక్ష్మి మాట్లాడుతూ టీబీ వ్యాధిగ్రస్తులు ఆరు నెలలు క్రమం తప్పకుండా మందులు వాడుతూ సరైన పౌష్టికాహారం తీసుకుంటే వ్యాధి నయమవుతుందన్నారు. కార్యక్రమంలో డా. తేజస్విని, సీహెచ్‌వో హేమావతి, పీహెచ్ఎన్ ఉషారాణి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రేపు అక్కచెల్లెమ్మలకు విడతలవారీగా ఆసరా పథకం



**తిరుపతిసిటీ, మార్చి24ప్రభాతవార్త :** 28వడివిజన్‌కు చెందిన సమాఖ్యసంఘాల సమావేశం నిర్వహించిన వార్డుకార్పొరేటర్ పొన్నాలచంద్ర ముఖ్యమంత్రి జగన్‌అన్న ఆదేశాలతో ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి సూచనలతో యువనాయకుడు డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి సహకారంతో అక్కచెల్లెమ్మలకు మూడవవిడతగా ఆసరాపథకం నగదు శనివారం జమచేయడం జరుగుతుందని చెప్పారు. జగన్ అన్న సంక్షేమ పథకాలు అందుకున్న కుటుంబాలు అండగా నిలవాలని పొన్నాలచంద్ర కోరారు.

# తిరుపతి డివిజన్

## 2కె 23 జాతీయ స్థాయి సాంకేతిక పోటీలు ప్రారంభోత్సవం



**తిరుపతి (విద్య), మార్చి 24 ప్రభాతవార్త :** శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో సదర్య – 2కె 23 జాతీయ స్థాయి సాంకేతిక పోటీలు శుక్రవారం వేడుకగా ప్రారంభించారు. ప్రారంభ ఉత్సవానికి ప్రొఫెసర్ ఆర్‌వీఎస్ సత్యనారాయణ, ప్రిన్సిపల్ ఎస్వీయూ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. పేపర్ ప్రెసెంటేషన్స్, పోస్టర్ ప్రెసెంటేషన్స్, ప్రాజెక్టు ఎక్స్పో, టెక్నికల్ క్విజ్, టెక్నికల్ గేమ్స్ మొదలైన వాటికి పోటీలు ఈ నెల 24, 25వ తేదిలలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ఉత్సవానికి ప్రొఫెసర్ పి. మల్లికార్జున, డైరెక్టర్, స్కూల్‌ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, ప్రొఫెసర్ పి. సత్యనారాయణ, ఈసిఈ కన్వీనర్ ప్రశాంతి, కో కన్వీనర్ డా. ఎ. సాయి సునీల్, స్టూడెంట్ కన్వీనర్ పావని, స్టూడెంట్ కో కన్వీనర్ తనూజ, ఈసిఈ విభాగపు కోఆర్డినేటర్ మాధవి పాల్గొన్నారు. ఈ పోటీలకు దేశంలో వివిధ ఇంజనీరింగ్ కాలేజీ నుండి విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## వంద శాతం ఉత్తీర్ణత సాధించడం లక్ష్యం చేసుకోవాలి.

**చంద్రగిరి, మార్చి 24 ప్రభాతవార్త:** పదవ తరగతి ఫలితాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యం చేసుకోవాలని ప్రధానోపాధ్యాయురాలు విజయ అన్నారు. అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, శ్రీపద్మావతీ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకుని ఆ మేరకు కృషి చేయాలన్నారు. పాఠశాల స్థాయి నుండి కళాశాలలోనికి ప్రవేశించబోతున్న మీరంతా ఆడపిల్లల పట్ల ఆకర్షణలకు లోనైతే భవిష్యత్తు అంధకారం కాగలదన్నారు.

## సబ్ రిజిష్ట్రసార్ కార్యాలయం, ఎస్‌బిఐ ఆదివారం పనిచేస్తాయి.

**చంద్రగిరి, మార్చి 24 ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా గల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) 51 బ్రాంచ్‌లు ఆదివారం పనిచేస్తాయని రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ డిపార్ట్‌మెంట్ స్టేట్ కమీషనర్ అండ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26 ఆదివారం ప్రజలు తమ రిజిస్ట్రేషన్లు, ఆర్థిక లావాదేవీలు నిర్వహించుకునేందుకు వీలుగా ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, ఎస్‌బిఐ బ్యాంకులు తెరచివుంచాలని ఆదేశించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ మేరకు కార్యాలయాల వద్ద నోటీసు బోర్డులో సమాచారం పెట్టాలని ఆదేశించారు. ఈ విషయమై సబ్ రిజిస్ట్రార్ మోహన్‌బాబును వివరణ కోరగా వాస్తవమేనని అంగీకరించారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన గాలి



**నగరి, మార్చి 24 ప్రభాతవార్త:** రంజాన్ నెల ప్రారంభం సందర్భంగా ముస్లిం సోదరులకు నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అత్యంత పవిత్రంగా నెలంతా దీక్షలు చేసే అందరికి అల్లా దయ సంపూర్ణంగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుతున్నానని తెలిపారు.

## క్షయ వ్యాధిని పూర్తిగా నివారిద్దాం



**నగరి, మార్చి 24 ప్రభాతవార్త:** క్షయ వ్యాధిని పూర్తిగా నివారిద్దామని ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డా. బాలకృష్ణ నాయక్ అన్నారు. శుక్రవారం జాతీయ క్షయ నిర్మూలన దినోత్సవం సందర్భంగా టీబీ యూనిట్ ఏరియా ఆస్పత్రి నగరిలో టీబీ వ్యాధిపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు వారాలకు పైగా దగ్గు, జ్వరం, రాత్రిపూట చమటలు పట్టడం, బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం, వంటి లక్షణాలు ఉంటే డాక్టర్‌ను సంప్రదించి గళ్ల పరీక్ష చేసుకోవాలన్నారు. క్షయ వ్యాధి నిర్ధార ఆయన రోగులు ఆరు నెలల పాటు రోజువారి మందులతో చికిత్స పొందాలన్నారు. టీబీ నివారణ సులభమేనని ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో వైద్యులు కార్తీకేయన్, ప్రవీణ, అంబిక, రాజశేఖర్, జయంత్, ప్రసాద్, నర్సింగ్ సూపరింటెండెంట్ రాజారత్నమ్మ, సిబ్బంది ఆముద, ఆదిలక్ష్మి, రమ్యకృష్ణ, సిద్ధయ్య, అరుణ్, పాండు, నందకుమార్, చందాహిని, పవన్, ప్రేమ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇదే చివరి గడువు ఇక ఉపేక్షించేది లేదు



**నగరి, మార్చి 24 ప్రభాతవార్త:** పట్టణ పరిధిలో ఎక్కడ బడితే అక్కడ తిరుగుతున్న పందుల సమస్య పరిష్కారానికి అధికారులు ఇప్పటికే పలుమార్లు పందుల పెంపకం దారులకు హెచ్చరికలు జారీ చేయడం, ఆ మేరకు రెండు మార్లు పందులు పట్టి దూరంగా తరలించడం జరిగింది. ఆపై పందుల పెంపకం దారుల అభ్యర్థనల మేరకు పందులను పట్టి దూరంగా వదిలిపెట్టే కార్యక్రమానికి అధికారులు విరామమిచ్చారు. అయితే అధికారులు ఇచ్చిన అవకాశాన్ని అలక్ష్యం చేస్తూ పందుల పెంపకం దారులు వర్షాలు పడే సమయంలో వచ్చిలవిడిగా పందులను వదిలిపెట్టేశారు. దీంతో మళ్లీ స్థానికుల నుంచి ఫిర్యాదులు అందడంతో శుక్రవారం పందుల పెంపకం దారులను మున్సిపల్ కార్యాలయం వద్దకు రప్పించినా మున్సిపల్‌కమిషనర్ వెంకట్రామిరెడ్డి వారిని గట్టిగా హెచ్చరించారు. ఈ నెల 30వ తేదీ వరకు చివరి గడువు అని ఆపై ఉపేక్షించేది లేదని నివాసిత ప్రాంతాల్లో సంచరించే పందులను పట్టి దూరపు ప్రాంతాల్లో వదిలి వేయడం జరుగుతుందన్నారు. పెంపకం దారులకు కలిగే ఆర్థిక నష్టానికి పురపాలక సంఘం వారు బాధ్యులు కారని సూచించారు.

## కాంగ్రెస్ పార్టీ నాయకుల నిరసన



**నగరి, మార్చి 24 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి రెండు సంవత్సరాలు జైలు శిక్ష విధించడంపైఐ పార్టీనాయకులు టవర్‌క్లాక్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ రాకేష్‌రెడ్డి ఆదేశాల మేరకు మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అల్లా పిచ్చి ఆధ్వర్యంలో టవర్‌క్లాక్ సెంటర్‌కు చేరుకున్న పార్టీ నాయకులు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగాను ప్రధాన మంత్రికి వ్యతిరేకంగాను నినాదాలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్‌బాబు, నాయకులుచిరంజీవిరెడ్డి, ఢిల్లీ, దేశయ్య, గుణశేఖర్, దేశప్పన్ తదితరులు పాల్గొన్నారు.

## క్షయ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి



**బుచ్చినాయుడు కండ్రిగ, మార్చి 24 ప్రభాతవార్త:** క్షయ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని బీఎన్ కండ్రిగ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి కె.మాధవి, డా. దివాకర్‌లు తెలిపారు. శుక్రవారం ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా జడ్పీహైస్కూలు ప్రధానోపాధ్యా యులు, వ్యాయామ ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ రెండు వారాలకు మంచి దగ్గు, జ్వరం ఉన్న దగ్గినప్పుడు గల్లిలో రక్తం పడినా, బరువు తగ్గినా, చాతి, ఎక్స్‌రేలో అనుమానాస్పద మరకలు ఉన్న క్షయ నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలని తెలిపారు. టీబీతో దిగులు వద్దని ఉచిత మందులే ముద్దు అనే నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. అలాగే 14 పంచాయతీల్లో ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఎం.సుబ్రహ్మణ్యం, ఏఎన్ఎం రత్నమ్మ, ఆశలు గౌరి, పద్మావతి, మునెమ్మ, మునివేలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బీసీ బాలుర వసతి గృహంలో సరస్వతీ పూజ



**బుచ్చినాయుడు కండ్రిగ, మార్చి 24 ప్రభాతవార్త:** బీసీ బాలుర వసతి గృహంలో పదో తరగతి విద్యార్థులు సరస్వతీ పూజా కార్యక్రమం పండితులచే ఏఎస్ డబ్ల్యు, వార్డెన్ రామయ్య ఆధ్వర్యంలో ఘనంగా పూజా కార్యక్రమం నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులు యూనిఫాం దుస్తులు ధరించి ఉప్పుతో ఓంకారం ఏర్పాటు చేసి రంగులతో అలంకరించి సరస్వతి పూజ భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పరీక్షలు బాగా రాసి వంద శాతం ఉత్తీర్ణత పాటు ప్రథమ ర్యాంకులు సాధించాలని విద్యార్థులను దీవించారు.

## వడమాలపేటలో వైద్య సిబ్బంది ర్యాలీ



**వడమాలపేట, మార్చి 24 ప్రభాతవార్త:** ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం వడమాలపేట మండలంలోని వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. క్రమం తప్పకుండా మందులు వాడితే క్షయను నివారించవచ్చని అధైర్య పడాల్సిన అవసరం లేదని కమ్యూనిటీ హెల్త్ అధికారి పురుషోత్తంరెడ్డి సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తామని అవగాహన కల్పించారు. వడమాలపేట పురవీధుల్లోర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్ చంద్రమోహన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి విద్యార్థి అధిక శాతం ఉత్తీర్ణత సాధించాలి

**కేవీబీ పురం, మార్చి 24 ప్రభాతవార్త:** ప్రతి విద్యార్థి అధిక శాతం ఉత్తీర్ణత సాధించి సమాజాభివృద్ధికి మంచి వైద్య నిపుణ్యాలు పెంపొందించుకోవాలని రాష్ట్ర హిస్టరి అకాడమి డైరెక్టర్ గవర్ల కృష్ణయ్య, పి.లాల్‌బాబు యాదవ్, ఆర్.నందకుమార్‌లు తెలిపారు. మండల కేంద్రమైన కేవీబీ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పదో తరగతి విద్యార్థుల పబ్లిక్ పరీక్షల సందర్భంగా సరస్వతి పూజా కార్యక్రమం ఆ పాఠశాల కమిటీ చైర్మన్ బాబు అధ్యక్షతన పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటకృష్ణయ్య నిర్వహించారు. విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొని సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించారు.

## కార్మిక మహిళల కాళ్ళు కడిగి సత్కరించిన డిప్యూటీ మేయర్

**తిరుపతి కార్పొరేషన్, మార్చి 24, ప్రభాతవార్త :**



బసవ తారక మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళాదినోత్సవవారోత్సవాల్లో భాగంగా శుక్రవారం4వ వార్డు కొర్లగుంటలో మహిళలను ప్రోత్సహిస్తూ ఏర్పాటు చేసిన సమావేశంలో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సి పల్ కార్పొరేషన్ లో కార్మికులుగా పని చేస్తున్న మహిళల కాళ్ళు కడిగి సత్కరిస్తూ, చీరలు పంపిణీ చేసారు. భర్త చనిపోయిన మహిళలకు 10 వేల రూపాయిలు నగదును చెక్కు రూపంలో అందించారు. ఈ కార్యక్రమంలో టౌన్ బ్యాంకు చైర్మన్ కేతం జయచంద్ర రెడ్డి, కార్పొరేటరు పుల్లూరు అమర్నాథ్ రెడ్డి, తిరుపతి మునిరామిరెడ్డి, దూది కుమారి, కోఆప్షన్ సభ్యులు రుద్రమరాజు శ్రీదేవి, టౌన్ బ్యాంకు డైరెక్టర్ జ్యోతి ప్రకాష్, కార్పొరేటర్ తిరుపతి మునిరామిరెడ్డి, పులికంటి గోపినాథ్ రెడ్డి, చిమటా రమేష్, కరాటే శీను, చక్రి, గపూర్, బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాలలో ముందుండాలి : డిప్యూటీ మేయర్

**తిరుపతి ప్రెస్‌క్లబ్,మార్చి 24 ప్రభాతవార్త:**



మహిళలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఇలా అన్ని రంగాలలో ముందుండాలని నగర డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి ఆకాంక్షించారు. శుక్రవారం బసవతారకం మహిళా సమాఖ్య తరపున అధ్యక్షురాలు రుద్రరాజు శ్రీదేవి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అభినయ్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తరపున రాష్ట్రంలోని డ్వాక్రా మహిళలకు ఆసరా, జగనన్న తోడు పథకాలు అందిస్తూ మహిళలు పురుషులతో పాటు ఆర్థిoగా ఎదగాలని కోరుకోవడం గర్వించదగ్గ విషయమన్నారు. అనంతరం భర్తలను పోగొట్టుకున్న సమాఖ్యలోని ముగ్గురు మహిళా వితంతువులకు కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ మరియు డా॥వైఎస్ఆర్ ప్రజా ప్రస్థానం చైర్మన్ డా॥పిసి. రాయలు సహాయం చేసిన 30 వేల రూ॥లను చెక్కుల రూపంలో ఆయన అందచేశారు. అలాగే పారిశుద్ధ్య మహిళా కార్మికులకు పసుపు కుంకుమలతో వారి పాదాలను కడిగి చీరలను కానుకగా అందచేశారు. అనంతరం బసవతారకం మహిళా సమాఖ్య తరపున డ్వాక్రా మహిళలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో టౌన్ బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, కార్పొరేటర్లు మునిరామిరెడ్డి, దూది కుమారి, అమర్‌నాథ్‌రెడ్డి, టౌన్ బ్యాంక్ డైరెక్టర్ జ్యోతి ప్రకాష్, చింతా రమేష్, మెప్మా ఐబి శ్రీరాములు, సిఎంఎంఒ కృష్ణవేణి, సిఒ ప్రమీల, ఆర్‌పి శివలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## తొండమాన్‌పురంలో శ్రీరామమందిరం కుంభాభిషేకం

**శ్రీకాళహస్తిరూరల్, మార్చి 24 ప్రభాతవార్త**



మండలంలోని తొండమాన్ పురంలో నూతనంగా నిర్మించిన సీతారాముల వారి మందిర కుంభాభిషేకం అంగరంగ వైభవంగా ఏర్పాటు చేసారు. శుక్రవారం ఏర్పాటుచేసిన కార్యక్రమాలకు శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా హాజరు కాగా గ్రామస్థులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇక్కడ జరుగుతున్న పూజల్లో భాగంగా చైర్మెన్ పూర్ణాహుతి లో పాల్గొన్నారు. సీతారాములను దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. గ్రామ పెద్దలు చైర్మెన్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో గ్రామస్థులు దామోదరరెడ్డి, చెంచుకృష్ణయ్య, విజయ్, మాధవరెడ్డి, బత్తెయ్య, రత్నం గోపాల్, గోవిందరెడ్డి, మునస్వామి, సంజీవయ్య, బాలస్వామి, బాలిరెడ్డి ఉపాధ్యాయులు వెంకటముని, నాదముని, దామోదరం, పూర్ణ, పుట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## శ్రీసిటీలో నేర సమీక్షా సమావేశం

**–శాంతిభద్రతల పరిరక్షణ, నేరనియంత్రణకు పెద్దపీట –జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి**

**సత్యవేడు, మార్చి 24, ప్రభాతవార్త:**

శ్రీసిటీ సెజ్ పారిశ్రామిక వాడలో శుక్రువారం జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి శ్రీసిటీ, నాయుడుపేట, గూడూరు సబ్ డివిజన్ పోలీస్ అధికారులతో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ లక్ష్యంగా విధులను సమర్ధవంతంగా నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీసిటీ పారిశ్రామిక నగరంలో దాదాపు 200పైగా పరిశ్రమలు నెలవై, తమిళనాడు సరిహద్దుగా ఉన్నందున ఇక్కడ చిన్నపాటి అసాంఘిక కార్యకలాపాలకు కూడా తావులేకుండా చూడాలన్నారు. శ్రీహరికోట రాకెట్ కేంద్రము సముద్రతీర ప్రాంతాల్లోనూ అక్రమ రవాణాలను అరికట్టాలని సూచించారు. గ్రూపు తగాదాలు, గొడవలు చోటుచేసుకుంటే రాజీమార్గంలో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామస్థాయిలో పోలీస్ వ్యవస్థ పనితీరుపై అవగాహన పెంపొందించాలని ఆదేశించారు. అనంతరం శ్రీసిటీ హైటెక్ పోలీస్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. దీర్ఘకాలిక ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో అదనపు ఎస్పీలు శ్రీవెంకటరావు, విమల కుమారి, ఎస్బి డిఎస్పీ సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జననేత గల్లా జయదేవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు

**–పుదిపట్ల గ్రామ సర్పంచ్ బడి సుధాయాదవ్**

**తిరుపతిరూరల్, మార్చి24 ప్రభాతవార్త:**



జననేత, గుంటూరు పార్లమెంట్ సభ్యుడు గల్లా జయదేవ్‌కు తిరుపతి రూరల్ పుదిపట్ల గ్రామ సర్పంచ్ బడి సుధాయాదవ్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎం.పి. గల్లా జయదేవ్ జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం డిల్లీలో ఎంపి గల్లా జయదేవ్‌ను కలిసి బడి సుధాయాదవ్ దుశ్శాలవతో ఘనంగా సత్కరించి, అప్యాయంగా స్వీట్స్ తినిపించి, మరెన్నో జన్మదిన వేడుకలను జరుపుకోవాలని, ఆ దేవ దేవుని ఆశీస్సులు ఎల్లవేళల ఉండాలని ఆకాంక్షించారు.

## నేటి నుండి వైయస్సార్ ఆసరా 3వ విడత జమ

**– కలెక్టర్ వెంకట రమణారెడ్డి**

**తిరుపతిరూరల్, మార్చి24 ప్రభాతవార్త:**

రాష్ట్ర వ్యాప్తంగా వైయస్సార్ ఆసరా 3వ విడత జమ, ఈనెల 25న జరుగుతుందని కలెక్టర్ వెంకట రమణారెడ్డి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 7.98లక్షల మహిళా సంఘాలలోని 78.94 లక్షల అక్క చెల్లెమ్మలకు లబ్ది చేకూరేలా రూ.6,419.89 కోట్లు నేరుగా మహిళా సంఘాల పొదుపు ఖాతాల్లో జమ చేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైయస్.రాజశేఖర్‌రెడ్డి శనివారం ఏలూరు జిల్లా దెందులూరు నుండి బటన్ నొక్కి ప్రారంభిస్తారని తెలిపారు. మూడో విడత ఆసరా ద్వారా తిరుపతి జిల్లాలోని 33,757 పొదుపు సంఘాలలోని 3,18,992 మందికి రూ.300.53 కోట్లు లబ్ది చేకూరనున్నదని కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. లబ్దిదారులకు కలెక్టర్ చెక్‌ను అందజేసారు.

## డ్రగ్స్ నష్టాలపై యువత, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్

**– జిల్లా రెవెన్యూ అధికారి రాజశేఖర్**

**చిత్తూరు, మార్చి 24 ప్రభాతవార్త:**



డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై యువత, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వాలని జిల్లా రెవెన్యూ అధికారి రాజశేఖర్ అన్నారు. డిఆర్‌డిఎ సమావేశహాలులో శుక్రవారం విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో డ్రగ్స్ కట్టడికి తీసుకోవాల్సిన చర్యలపై వివిధ శాఖలు రూపొందించిన యాక్షన్ ప్లాన్, తీసుకోవాల్సిన చర్యలపై జరిగిన సమన్వయ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి రాజశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగించడం వల్ల మానసిక, ఆర్థిక ఇబ్బందులతో పాటు సమాజంలో చులకన భావన కలుగుతుందన్నారు. యువత దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని, కొంతమంది యువత డ్రగ్స్‌కు బానిసై వారి జీవితాలను చెడు మార్గాల్లో తీసుకెళ్తున్నారని, దీని నుండి వారిని కాపాడటానికి ప్రభుత్వ శాఖల అధికారులు, తల్లిదండ్రులు, ఎన్‌జిఒలు కలిసి పని చేయాలన్నారు. కళాశాలలు, పాఠశాలల్లో యువత డ్రగ్స్ బారిన పడకుండా వారంలో ఒక రోజు డ్రగ్స్ వాడకం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమాలను జిల్లా విద్యాశాఖ నిర్వహించాలన్నారు. యువత, తల్లిదండ్రులకు డ్రగ్స్ కల్ల కలిగే నష్టాలపై కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. నగర, పట్టణ ప్రముఖ కూడళ్ళు, ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో బ్యానర్లు, పోస్టర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రణాళిక అధికారి ఉమాదేవి, డిఆర్‌డిఎ పిడి డిఎంకె తులసీ, మెప్మా పిడి రాధామ్మ, డ్వామా పిడి గంగాభవానీ, ఐసిడిఎస్ పిడి నాగశైలజ, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో డిఎస్ఎఫ్ఓ ఆయిషా బేగం, జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి మూర్తి, బిసీ సంక్షేమశాఖ అధికారి చిన్నారెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఇడి నరసింహులు, డిసిహెచ్ఎస్ డాక్టర్ నాయక్, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## సంఘాల బలోపేతంకు విరివిగా రుణాలు

**– నెలాఖరు వరకు వడ్డీ రాయితీ, వడ్డీపై వడ్డీ, ఆపరాధ వడ్డీ మాఫీ**

**– తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో ప్రాంతీయ కార్యాలయాలు**

**– జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సర్వసభ్య సమావేశంలో ఛైర్మన్ రెడ్డమ్మ కృష్ణమూర్తి**

**చిత్తూరు, మార్చి 24 ప్రభాతవార్త:**



జిల్లాలో సహకార సంఘాలు మరింత బలోపేతం చేయడానికి విరివిగా రుణాలు మంజూరు చేయాలని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు మహాజనసభ తీర్మానించింది. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సమావేశభవనంలో శుక్రవారం ఛైర్‌పర్సన్ రెడ్డమ్మకృష్ణమూర్తి అధ్యక్షతన డిసిసిబి మహాజన సభ జరిగింది. ఈ సమావేశంలో ఛైర్‌పర్సన్ రెడ్డమ్మ కృష్ణమూర్తి మాట్లాడుతూ డిసిసిబి బ్రాంచి కార్యాలయాలు, ప్రాథమిక పరపతి సంఘాల ద్వారా ఇప్పటికే బట్వాడా చేయబడిన స్వల్పకాలిక, దీర్ఘకాలిక, వ్యవసాయేతర రుణాలు వాయిదా మీరిన రుణాలను చెల్లించిన వారికి వడ్డీ రాయితీ, వడ్డీపై వడ్డీ, అపరాధ వడ్డీ మాఫీ పథకంను ఈ నెలాఖరు వరకు పొడగిస్తున్నామని పేర్కొన్నారు. అలాగే ఇది వరకు చిత్తూరు జిల్లాగా వుండి ప్రస్తుతం జిల్లా పునర్విభజన కావడంతో తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో డిసిసిబి ప్రాంతీయ కార్యాలయాలు ఏర్పాటు చేయనున్నట్లు ఛైర్మన్ రెడ్డమ్మ పేర్కొన్నారు. ఈ సమావేశంలో పాలకవర్గ సభ్యులు, జిల్లా సహకార అధికారి బ్రహ్మానందరెడ్డి, డిసిసిబి సిఇఒ మనోహర్‌గౌడ్, సింగిల్‌విండోల అధ్యక్షులు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతాల నుంచి ఉన్నత స్థానాలకు వెళ్లాలి : ఎంపీ

**సదుం, మార్చి24 ప్రభాతవార్త :**



గ్రామీణ ప్రాంతాలలోని పాఠశాలల్లో నుంచి విద్యార్థులు మంచి ఉన్నత స్థానాలకు వెళ్లాలని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సదుం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం మరియు పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయనముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులతో మాట్లాడారు. సదుం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తంబళ్లపల్లె శాసనసభ్యుడు పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డి, ప్రస్తుత ఎంపీపీ ఎల్లప్ప తదితరులతో పాటు ఎంతో మంది చదువుకున్నారన్నారు. వారిలాగా అందరు ఉన్నత స్థానాలకు వెళ్ళి మన పాఠశాలకు, మన ఊరికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. పాఠశాల అభివృద్దికి తాను ఎప్పుడు సహకరిస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా త్వరలోపాఠశాలలో కంప్యూటర్ విద్యనునేర్పించేందుకు కంప్యూటర్లు అందజేసి ట్యూటర్‌నుకూడా నియమిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో విద్యార్థులతో ఆయన అమ్మఒడి ఎంతమందికి వస్తుంది, ఎంపీసీ లో ఎంత మంది చేరుతారు, బైపీసీలో ఎంత మంది చేరుతారు అని ప్రశ్నించారు. పాఠశాలలో అన్ని రకాల సౌకర్యాలు ఉండేటప్పుడు బాగా చదువుకోవాలని సూచించారు. గతంలో లాగే ఈఏడాది కూడా వంద శాతం ఫలితాలు సాధించాలన్నారు. ఇటీవల పుట్‌బాల్ పోటీలలో సదుం ఉన్నత పాఠశాల నుంచి రాష్ట్ర స్థాయికి ఎంపికై పోటీలలో పాల్గొన్న విద్యార్థికి కప్పును, ప్రశంశాపత్రాన్ని ఎంపీ అందజేశారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడుపెద్దిరెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, జడ్పీటీసీ సోమశేఖరరెడ్డి, పీలేరు జడ్పీటీసీ ఏటీ రత్నశేఖరరెడ్డి, ప్రభుత్వ వైద్యశాల చైర్మెన్ కృష్ణారెడ్డి, సమగ్ర శిక్ష అధికారి అజయ్‌కుమార్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు ఫజురుల్లా, సర్పంచిలు ఉషారాణి, హనుమంతురెడ్డి, ఏపీడీ శ్రీనివాసులు, ఏపీఒ శివశంకర్, ఉపసర్పంచి బాబురెడ్డి, ఎంపీటీసీ మల్లికార్జున, పెద్దిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, యర్రాతివారిపల్లె మాజీసర్పంచి ధనశేఖరరెడ్డి, వాసు, యండపల్లె మనోహరరెడ్డి, డాక్టర్ ఇందాద్, ఎస్ఐ మారుతి తదితరులు పాల్గొన్నారు.

## వేగవంతంగా అభివృద్ధి పనులు : కమీషనర్

**చిత్తూరు, మార్చి 24 ప్రభాతవార్త:**



నగర పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా చేపట్టి పూర్తి చేయాలని మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ అధికారులు, గుత్తేదారులను ఆదేశించారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో శుక్రవారం కమీషనర్ డాక్టర్ జె.అరుణ ఇంజనీరింగ్ అధికారులు, గుత్తేదారులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో కమీషనర్ మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన పనులు ఇప్పటికే జరుగుతున్నాయని వీటిని వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. బిటీ రోడ్లు, సిమెంటు రోడ్లు, కల్వర్టులు, డ్రైనేజీ పనులను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. అలాగే టెండర్లు దక్కించుకొన్యన గుత్తేదారులు పనులను త్వరితంగా ప్రారంభించి పూర్తి చేయాలన్నారు. నగర పరిధిలోని గాంధీ సర్కిల్, ఎంఎస్ఆర్ సర్కిల్ తదితర ప్రాంతాల్లో మెరుగైన లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంఇ ధనలక్ష్మి, డిఇలు రమణ, వెంకటప్రసాద్, ఎఇలు, గుత్తేదారులు పాల్గొన్నారు.

## గణనాధునికి వెండి కిరీటము, వీభూదిపట్టీ విరాళం

**కాణిపాకం, మార్చి 24 ప్రభాతవార్త:**

కాణిపాకం శ్రీవరసిది వినాయకస్వామి వారికి ఒ భక్తుడు శుక్రవారం వెండి కిరీటము, వీబూది పట్టీని విరాళంగా అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన శ్రీనివాసరావు అనే భక్తుడు సుమారు రెండు కిలోల వెండితో రెండు లక్షల రూపాయల వ్యయంతో



స్వామివారికి ప్రత్యేకంగా తయారు చేయించిన కిరీటము, వీభూదిపట్టీని విరాళంగా అందజేశారు. వీటిని దాత కుటుంబసభ్యులతో కలసి ఆలయ సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాబులకు అందజేశారు. దాతలకు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్ధ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో దాత కుటుంబభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా వంగళపూడి అనిత పుట్టినరోజువేడుకలు



**శ్రీకాళహస్తి, మార్చి 24 ప్రభాతవార్త :** యువనాయకురాలు పోలిట్‌బ్యూరో సభ్యురాలు, మాజీ శాసనసభ్యురాలు రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత పుట్టినరోజు వేడుకలను తిరుపతి మహిళా పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు చక్రాల.ఉష ఆధ్వర్యంలో నియోజకవర్గ అధ్యక్షురాలు రుద్రాక్షల కౌసల్య ఆధ్వర్యంలో వెంకటగిరి నియోజకవర్గంలో పోలేరమ్మకు ప్రత్యేకపూజలు నిర్వహించి కేక్‌కట్‌చేసుకుని సంబరాలు మహిళలు సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షురాలు మాధవి, ప్రసన్న, పార్వతమ్మ, కృష్ణవేణమ్మ, పుష్ప, గోపి, గౌసి, ఆదెమ్మ, దేవసేన, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## వైభవం..తిరుచ్చివాహన సేవ

**–అధిక సంఖ్యలోపాల్గొన్న భక్తులు**

**శ్రీకాళహస్తి, మార్చి 24 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రతి శుక్రవారం సాయంత్రం స్వామిఅమ్మవార్ల దీపారాధన అనంతరం అమ్మవారి ఆలయం వెలుపల ఉన్న మండపంలో ఆలయంలోవెలసిన జ్ఞానప్రసూనాంబికాదేవిని ఆలయంలోని అలంకార మండపంలో సర్వాంగ సుందరంగా అలంకరించి తిరుచ్చివాహనంపై కొలువుదీర్చి వేదమంత్రాలు, మంగళవాయిద్యాలనడుమఅమ్మవారికిఆలయ ప్రాకారోత్సవం, తిరుచ్చి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ హరియాదవ్, ఆలయ సిబ్బంది, పలువురు భక్తులు పాల్గొన్నారు.

## గరుడుని అధిరోహించిన శ్రీరామచంద్రుడు

**–రామనామంతో ప్రతిధ్వనించిన తిరుపతి**



**తిరుపతి, మార్చి 24ప్రభాతవార్త:** తిరుపతిలోని కోదండరామ స్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్స వాల్లో ఐదవరోజు శుక్రవారం రాత్రి గరుడవాహనంపై శ్రీరామచంద్రమూర్తి భక్తులకు దర్శనమిచ్చారు. 108 దివ్యదేశాలలో గరుడవాహనం అత్యంత విశిష్టమైనది. గరుడునిపై శ్రీరామచంద్రమూర్తి సర్వాలంకారభూషితుడై ఆలయ మాఢవీధుల్లో ఊరేగారు. వాహనమండపం నుంచి బయులుదేరిన గరుడవాహనంలోని స్వామివారికి భక్తులు అడుగడుగునా కర్పూరహారతులిచ్చారు. కోదండరామా.. జగదభిరామా...రామాయ రామభద్రాయ అంటూ భక్తుల నామస్మరణలతో తిరుపతి ప్రతిధ్వనించింది. ఈ వాహనసేవలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టిటిడి జెఇఒ వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఇఒ నాగరత్న, ఎఇఒ మోహన్, ఆలయ సూపరింటెండెంట్ రమేష్, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

**–ఉదయం మోహినీఅలంకారంలో కోదండరాముడు:**

వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఐదవరోజు ఉదయం స్వామివారు మోహనీఅలంకారంలో భక్తులకు దర్శనమిచ్చాడు. మోహినీ అవతారవృత్తాంతం రమణీయంగా వర్ణింపబడింది.

## వైఎస్ఆర్‌సిపి నుండి సస్పెండైన ఎంఎల్ఎ ఆనం

**వెంకటగిరి, మార్చి24 ప్రభాతవార్త :**



ఎంఎల్‌సి ఎన్నికల్లో టిడిపి అభ్యర్థికి ఓటు వేశారని వెంకటగిరి నియోజవర్గ ఎంఎల్ఎ ఆనం రామనారాయణరెడ్డిని వైఎస్ఆర్‌సిపి పార్టీ నుండి సస్పెండ్ చేసినట్లు ప్రభుత్వ రాజకీయ సలహదారు సజ్జల రామకృష్ణరెడ్డి శుక్రవారం నాడు ప్రకటించారు. పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నట్లు గత మూడు నెలల నుండి ఎంఎల్ఎ ఆనం ను పార్టీ దూరంగా పెట్టింది. నియోజవర్గ సమన్వయకర్తగా నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని నియమించింది. ఆయనపై పార్టీ ఎలాంటి చర్యలు తీసుకోకుండా పక్కన పెట్టింది. అయితే ఎంఎల్‌సి ఎన్నికల్లో టిడిపికి ఓటు వేశారని ఆరోపణ రావడంతో పార్టీ నుండి సస్పెండ్ చేశారు. 2019 ఎన్నికల్లో ఆయన వైసిపి పార్టీ నుండి విజయం సాధించారు. ఎంఎల్ఎ ఆనం టిడిపి లోకి పోతారన్న ప్రచారం సాగుతోంది. ఆయన టిడిపిలోకి పోవాలని ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారన్న ఆరోపణలు వచ్చాయి. ఆనం ఉమ్మడి రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రిగా కూడ పనిచేశారు. దివంగత మాజీ సిఎం రాజశేఖర్‌రెడ్డికి ముఖ్య అనుచరుడిగా వ్యవహరించారు. ఆయన టిడిపి నుండి ఆత్మకూరు గాని, వెంకటగిరి కాని పోటి చేయలన్న ఆలోచనలు ఉన్నట్లు ఆయన అనుచరులు భావిస్తున్నారు. ఎప్పుడు టిడిపిలో చేరుతారన్నది స్పష్టత లేకపోగా, ఆనం ను పార్టీ నుండి సస్పెండ్ చేయడం సంచలనంగామారింది.

## అంతర్జాతీయస్థాయి విద్యాప్రమాణాలు

**–వేడుకగా ఎస్వీఉన్నతపాఠశాల వార్షికోత్సవం**

**తిరుమల, మార్చి 24ప్రభాతవార్తప్రతినిధి:**



ఏడుకొండలస్వామి కొలువైన పుణ్యక్షేత్రంలో ఎస్వీ ఉన్నతపాఠశాలలో అంతర్జాతీయ స్థాయి విద్యాప్రమాణాలతో అత్యుత్తమ విద్యను అందిస్తున్నట్లు టిటిడి జెఇఒ సదభార్గవి తెలిపారు. శుక్రవారం సాయంత్రం తిరుమలలో టిటిడి ఆధ్వర్యంలోని ఎస్వీ ఉన్నతపాఠశాల 51వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి విశిష్టఅతిథిగా ప్రొఫెసర్ కామకోటి, ముఖ్యఅతిథిగా టిటిడి జెఇఒ సదాభార్గవి హాజరయ్యారు. ఈ ఉన్నతపాఠశాలను రేమాండ్స్, సింఘానియాట్రస్ట్ సహకారంతో మెరుగైన సదుపాయాలు కల్పిస్తామన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. టిటిడి డిఇఒ భాస్కర్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణమూర్తి విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వేదనారాయణుడికి పట్టువస్త్రాలు సమర్పణ

**నాగలాపురం, మార్చి24, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలో కొలువై ఉన్న శ్రీవేదవల్లి సమేత వేదనాయణ స్వామి వారి ఆలయంలో వార్షిక సూర్యపూజోత్సవం, మత్స్య జయంతిని పురస్కరించుకుని శుక్రువారం శ్రీకాళహస్తి ఆర్‌డిఓ రామారావు, శ్రీవేద నారాయణ ధర్మరక్షణ సమితి, శ్రీఏకవీర సేవా సమితి తో కలిసి స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలను సమర్పించారు. స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శాంతిహోమం పూజలో పాల్గొన్నారు. ఆలయ అధికారులు స్వాగతించి ఆలయ విశిష్టతను తెలిపారు. స్వామి వారి తీర్ధ ప్రసాదాలను అందజేశారు.

## అన్నిదానాల్లోకెల్లా రక్తదానం ఎంతో గొప్పది : ఎండి చల్లారావు

**కోట, మార్చి 24 ప్రభాతవార్త**



కోట మండలం చిట్టేడులోని జివిఆర్ వ్యవస్థాపకులు, దివంగత మహానేత గ్రంధి వెంకటేశ్వరరావు జయంతిని పురస్కరించుకొని శుక్రవారం ఫ్యాక్టరీలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ముందుగా జివిఆర్ వ్యవస్థాపకులు గ్రంధి వెంకటేశ్వరరావు చిత్రపటానికి ఆయన తనయుడు, జివిఆర్ ఎండి చెల్లారావు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని చల్లారావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలో గాయపడి రక్తం అందక ఎంతోమంది మృత్యువాత పడుతుంటారని చెప్పారు. ప్రమాదాల్లో ఉన్న వారిని కాపాడటానికి రక్తదానం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం పలువురు కార్మికులు మాట్లాడుతూ వెంకటేశ్వరరావు భౌతికంగా లేకపోయినా కార్మికుల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని చెప్పారు. ఆయన పెట్టిన భిక్ష వల్లే నేడు ఎంతోమంది జీవనోపాధి పొందుతున్నారని చెప్పారు. ఈ రక్తదాన శిబిరాన్ని గూడూరు ప్రాంతీయ వైద్యాధికారి సందీప్ రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిఎం కృష్ణ, కార్మికులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అంతకుముందు ఫ్యాక్టరీ ప్రాంగణంలో వందలాది మందికి అన్నదానం ఏర్పాటు చేశారు.

## శ్రీ వెంకటాంబ ఆలయంలో మహాకుంభాభిషేక వేడుకలు

**– వందలాదిగా తరలివచ్చిన భక్తులు, గ్రామప్రజలు**



**ఓజిలి, మార్చి 24 ప్రభాతవార్త :**

ఓజిలి మండలం కరబల్లవోలు గ్రామంలో వెలసి ఉన్న భగవతి శ్రీవెంకటాంబ ఆలయంలో శుక్రవారం వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య మహా కుంభాభిషేకం, విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు నిర్వహించారు. ఆధ్యాత్మిక మార్గదర్శకులు శ్రీఒట్టుకనాథస్వామి ఆధ్వర్యంలో భగవతి శ్రీ వెంకటాంబ ఎరుక ఆశ్రమంలో శుక్రవారం వేదపండితుల మధ్య మహా కుంభాభిషేకం విగ్రహ ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. కరబల్లవోలు గ్రామంలో శుక్రవారం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. వందలాదిగా తరలివచ్చిన భక్తులతో పల్లెలో పండుగ వాతావరణం నెలకొంది. విగ్రహ ప్రతిష్ట హోత్సవాన్ని పూర్తి చేశారు. అంతకుముందు ఆలయలో విఘ్నేశ్వర పూజ, పుణ్యవచన, పీఠార్చనలు, రత్నన్యాసం, జలాదివాసంతో పాటు రకరకాల పూజలు నిర్వహించారు. ప్రతిష్ట అనంతరం కుంభాభిషేకం, మహాపూర్ణాహుతితో పాటు పలు పూజలు చేశారు. పూజా కార్యక్రమాలకు సమీప గ్రామాల నుంచి వందలాదిగా భక్తులు తరలివచి ప్రతిష్ఠలో పాల్గొన్నారు. భక్తజన సందోహంతో గ్రామం మొత్తం కోలాహలంగా మారింది. మహోత్సవాల్లో భాగంగా మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో గ్రామస్తులు, భక్తులు వందలాదిగా పాల్గొన్నారు. శ్రీవెంకటాంబ విగ్రహ ప్రతిష్ట, కుంభాభిషేకం యంత్రాల పూజ, గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భగవతి శ్రీవెంకటాంబ మహా కుంభాభిషేక వేడుకలో గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గూడూరు సుధీర్‌రెడ్డి, గ్రామస్తులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.